# చిత్తశుద్ధి ఉన్నప్పుడే కార్యసిద్ధి

గత జీవుడగు పతిన్ బ్రతికించికొన్నట్టి
సావిత్రి భారత సతియె కాదె
తన సత్యమహిమచే దావాగ్ని చల్లార్చె
చంద్రమతి పవిత్ర పడతి కాదె
కులసతీత్వమునకై గుండాన దూకిన
సీత భారత ధరాజాత గాదె
కినిసి దుర్మద కిరాతుని బూది గావించె
దమయంతి భారత రమణి గాదె
సత్వ సాగర పరివేష్టితోర్వీతలము
భరతజాతి పాతివ్రత్య ప్రవిమలంబు
భావసంపద కిది మహా పంటభూమి
అఖిల దేశాలకిది ఉపాధ్యాయి కాదె!

ప్రేమస్వరూపులారా! అఖిల వ్రతములకన్న వరలక్ష్మి వ్రతము మిన్న. ఉదయం పురోహితుడు చెప్పాడు– స్త్రీలకు సుక్షేమాన్ని, సౌభాగ్యాన్ని ప్రసాదించే వ్రతం ఏమైనా ఉన్నదా? అని ఒకానొక సమయంలో పార్వతీదేవి ఈశ్వరుణ్ణి ప్రశ్నించిందట. ప్రతి స్త్రీ ఆయురారోగ్యఐశ్వర్యాలతో, పుత్ర పౌత్రాభివృద్ధితో సుమంగళిగా జీవించాలని పార్వతి కోరిక. స్త్రీలు తమ కుటుంబము గురించి, తమ వంశము గురించి, తమ సౌభాగ్యముగురించి అనేక విధాలుగా పాటుపడుతుంటారు. సమత, సమగ్రత, సమైక్యత, సౌభ్రాతృత్వములను కోరేది స్త్రీలే. ఇట్టి సుగుణ సంపన్నులైన స్త్రీలకు ఏదైనా వరప్రసాదమును అనుగ్రహించాలని పార్వతి ఈశ్వరుణ్ణి ప్రార్థించినట్లు పురాణములలో ఉన్నది. దీనికి ఈశ్వరుడు కూడా సంతోషించి, స్త్రీలకు అష్టైశ్వర్యములను అనుగ్రహించే వరలక్ష్మీ వ్రతముగురించి పార్వతికి తెలియచేశాడు. ఇది స్త్రీలకు ప్రత్యేకమైన వరప్రసాదము.

sri sathyasai vahenamrutam

సావిత్రి మరణించిన పతిని తన శీలసంపత్తిచేత బ్రతికించుకోగల్గింది. ఈ కలియుగమునందుకూడా సతి ప్రార్థనచేత పతి ప్రమాదములనుండి రక్షింపబడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ప్రాచీన కాలమునుండి ఎందరో సాధ్వీమతల్లులు భారతదేశమునందు ఉద్భవించి, వరలక్ష్మీ వ్రతమును ఆచరించి వరలక్ష్మీ అనుగ్రహమునకు పాత్రులైనారు. రావణసంహారం తరువాత రాముడు సీతకు అగ్ని పరీక్ష పెట్టాడు. సీత మహాసాధ్వి అన్న విషయం సర్వజ్ఞుడు, సర్వ వ్యాపకుడు, సర్వశక్తిమయుడైన రామునికి తెలియనిది కాదు. కాని, లోకులు కాకులు. వారిలో ఎలాంటి అనుమానాలకు అవకాశం ఇవ్వకూడదనే ఉద్దేశ్యంతో రాముడు ఈ పని చేశాడు. సీత ఏ మాత్రము సందేహించకుండా అగ్ని పరీక్షను ఎదుర్కొని తన పాతివ్రత్యాన్ని నిరూపించింది. సత్యశీలురు, పవిత్ర హృదయులైన స్త్రీలు ఎలాంటి అనుమానాలకూ అవకాశమివ్వరు.

**త్రిమూర్తులనే పసిపాపలుగా మార్చిన అనసూయ**

ప్రాచీన కాలమునుండి పవిత్రమైన భారత దేశమునందు గుణవంతులైన స్త్రీ పురుషులు ఉండటంచేతనే భారతదేశం సుక్షేమంగా, సుభిక్షంగా వర్థిల్లుతూ వచ్చింది. అత్రి మహర్షి భార్య అనసూయ. ఆమె మహాపతివ్రత. ఆమెను పరీక్షించటానికి సాక్షాత్తు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులే మునీశ్వరుల రూపంలో ఆమె ఇంటికి వెళ్లి "భవతి భిక్షాం దేహి" అన్నారు. ఆమె వారికి భిక్ష వేయబోగా "మేము భిక్ష స్వీకరించాలంటే నీవు వివస్త్రవై వడ్డించాలి" అని షరతు విధించారు. అప్పుడామె పరిశుద్ధమైన హృదయముతో సంకల్పించుకొని వారిని పసిపాపలుగా మార్చివేసింది. తన హృదయపవిత్రత, సత్యశీలములచేత సాక్షాత్తు త్రిమూర్తులనే ఆమె పసిపాపలుగా మార్చి ఆడించగల్గింది. సరస్వతి, లక్ష్మి, పార్వతి ముగ్గురూ ఆమె ఇంటికి వచ్చి "అమ్మా! నీవు మా పతులను పసిపాపలుగా మార్చి ఆడించుకుంటే మా గతి ఏమి కావాలి?" అని అన్నారు. అనసూయ దయతలచి వారి పతులను వారికి అప్పగించింది. అప్పుడు బ్రహ్మ, విష్ణు , మహేశ్వరులు త్రిమూర్త్యాత్మక స్వరూపుడైన దత్తాత్రేయుడు ఆమె గర్భంలో జన్మిస్తాడని వరమిచ్చారు. అత్రి మహర్షికి దత్తతగా వచ్చినవాడు కనుకనే అతనికి దత్తాత్రేయుడని పేరు వచ్చింది.

sri sathyasai vacharamrutam

## సూర్యోదయాన్ని ఆపిన సుమతి

సుమతికూడా గొప్ప పతివ్రత. నిర్మల, నిస్వార్థ హృదయురాలు. ఒకనాడు ఒక ఋషి ఆమె భర్త మరునాడు సూర్యోదయమైన తక్షణమే మరణిస్తాడని శపించాడు. సర్వ శాపములను, పాపములను పరిహారం గావించేది ప్రార్థనయే! ఆమె సద్భావంతో భగవంతుణ్ణి ప్రార్థించింది. "రేపు సూర్యోదయమైతే కదా నా పతి ప్రాణం పోయేది. నాది సత్యసంకల్పమే అయితే రేపు సూర్యోదయమే కాకుండా ఉండాలి" అన్నది. ఆమె సంకల్పానుసారం మరునాడు సూర్యుడు ఉదయించనే లేదు. తత్ఫలితంగా ప్రపంచమంతా అంధకారంలో మునిగి అల్లకల్లోలమై పోయింది. అప్పుడు దేవతలు, ఋషులు సుమతివద్దకు వచ్చి "అమ్మా! నీ పతికోసం ప్రపంచమంతటినీ నీవు అంధకారంలో ముంచటం భావ్యమా?" అని అన్నారు. "నా పతి లేకపోతే నాకీ ప్రపంచంతో అవసరమేమున్నది?" అని సుమతి సమాధానమిచ్చింది. అప్పుడు దేవతలు "నీ పతిని మేము క్షేమంగా చూసుకుంటాం" అని మాటిచ్చిన తరువాతనే ఆమె సూర్యోదయం కావాలని సంకల్పించుకొంది. ఈ విధంగా ప్రాచీన కాలము నుండి భారతదేశంలో పతివ్రతామతల్లులు మహత్తరమైన శక్తులను ప్రకటిస్తూ, ఆదర్శాలు అందిస్తూ వచ్చారు. ప్రాచీన కాలమునందే కాదు; ఈ కలియుగమునందు కూడా స్త్రీలకు ఇలాంటి శక్తిసామర్థ్యములున్నాయి.

## ఇల్లాలును బట్టి ఇల్లు

స్త్రీలకు సుమంగళత్వాన్ని, సౌభాగ్యాన్ని , సిరిసంపదలను, అష్టైశ్వర్యాలను అనుగ్రహించేది వరలక్ష్మి. కోరిన వరములను ప్రసాదించేది కనుకనే వరలక్ష్మికి ఆ పేరు వచ్చింది. సావిత్రి, చంద్రమతి, దమయంతి మున్నగు సాధ్వీమణులు వరలక్ష్మీ అనుగ్రహప్రసాదంచేతనే అంతటి శక్తి, సామర్థ్యాలను పొందగలిగారు. స్త్రీలు వరలక్ష్మి నోమును నోచటంచేత సిరిసందలు అభివృద్ధి అవుతాయి, ఆనందము చేకూరుతుంది. కాని, ఈ ఆధునిక యుగంలో ఇలాంటి పవిత్రమైన వ్రతములను ఆచరించటం తగ్గిపోయింది. కనుకనే గృహములలో పవిత్రత లోపించింది. ఇల్లును చూసి ఇల్లాలిని చూడమన్నారు. ఇల్లు పరిశుద్ధంగా ఉందంటే ఇల్లాలి హృదయంకూడా పరిశుద్ధంగా ఉంటుందని అర్థం. ప్రాచీన కాలంలో ఇళ్లు ఎంతో పరిశుద్ధంగా ఉండేవి. ఎందుకంటే ఆనాటి స్త్రీల హృదయాలు అంత పరిశుద్ధమైనవి. కాని ఈనాడు ఎక్కడ చూసినా మాలిన్యం, మాలిన్యం! త్రాగేనీరు, తినే తిండి, పీల్చే గాలి కలుషితమైపోయాయి. మానవుని

sri sathyasai vahini.org

మనస్సుకూడా మలినం కావటంచేతనే సర్వమూ మలినమైపోయింది.

**హృదయం ఒక పెన్ను వంటిది**

ఈనాటి మానవుని మనస్సు పూర్తి నెగెటివ్ భావాలతో నిండియుంది. నెగెటివ్ భావాలంటే ప్రాపంచిక సంబంధమైన వాంఛలు, ఆశలు. ఇవి ఉండటంలో తప్పు లేదు. కాని, ఒక పరిమితిలో ఉండాలి. పెన్నుతో ఏ వ్రాతలు వ్రాసినా, ఏ గీతలు గీసినా అవి పెన్నులో నింపిన ఇంకుయొక్క రంగునే కలిగియుంటాయి. ఇంకు నీలంగా ఉంటే అవి నీలంగా కనిపిస్తాయి. ఎఱ్ఱగా ఉంటే ఎఱ్ఱగా కనిపిస్తాయి. హృదయం ఒక పెన్ను వంటిది. మీరు అందులో నెగెటివ్ భావాలను నింపుకుంటే మీ ఆలోచనలు, పలుకులు, పనులు, చూపులు అన్నీ నెగెటివ్‌గానే ఉంటాయి. కనుక, మొట్టమొదట హృదయాన్ని ప్రేమతో నింపుకోవాలి. అప్పుడే మీరు చూసే చూపులు, పలికే పలుకులు, చేసే పనులు అన్నీ ప్రేమమయంగా ఉంటాయి. జగత్తంతా ప్రేమమయంగా మీకు గోచరిస్తుంది. కాని, ఈనాడు మీ హృదయంలో అట్టి ప్రేమ లేకపోవటంచేతనే ద్వేషము, అసూయ, ఆడంబరం ఇత్యాది నెగెటివ్ భావాలు ప్రవేశిస్తున్నాయి. అపవిత్రమైన ఆహారవిహారములవలన, మితిమీరిన దేహాభిమానంవలన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే దుర్గుణాలు మీలో ఆవిర్భవిస్తున్నాయి. కనుక, దేహాభిమానమును, దేహ సంబంధమైన వాంఛలను అదుపులో పెట్టుకోవాలి. వాంఛలనే 'లగేజి' తగ్గించుకున్నప్పుడే జీవిత ప్రయాణం సుఖంగా జరుగుతుంది. దేహాభిమానం ఉండవచ్చు. ఆలుబిడ్డలతో, బంధుమిత్రులతో కలిసి జీవించేటప్పుడు దేహాభిమానం లేకుండా ఉండటానికి వీలుకాదు. అయితే దానిని అదుపులో పెట్టుకొని, "లోకాస్సమస్తాసుఖినో భవంతు" అనే పవిత్రమైన భావంతో జీవితాన్ని గడపాలి.

**బయట కనిపించేదంతా అంతర్భావ ప్రతిబింబమే**

ప్రపంచమంతా మానవుని హృదయంపైనే ఆధారపడియున్నది. ప్రపంచంలో ఏఏ శక్తులున్నవో అవన్నీ ఒక్క మానవునియందే ఉంటున్నవి. మానవ శరీరమే ఒక పెద్ద జనరేటరు; హృదయమే రేడియో, మనస్సే టెలివిజన్. కనుక బయట కనిపించే ప్రతి ఒక్కటీ అంతర్భావముయొక్క ప్రతిబింబమే. మీరు ఇతరులలో చెడ్డ చూస్తున్నారంటే, మీయందున్న చెడ్డయే వారియందు ప్రతిబింబిస్తున్నదని గ్రహించండి. మీరు ఇతరులయొక్క చెడును గురించి

srisathyasaivachanamrutam

వింటున్నారంటే, అది మీలోని చెడుయొక్క ప్రతిబింబమే అని గుర్తించండి. మంచి చెడ్డలు రెండూ మీనుండియే వస్తున్నాయి. మీరు అద్దంముందు నిలబడినప్పుడు అందులో మీ రూపముందా? లేదు. మీ ప్రతిబింబమే అద్దంలో కనిపిస్తున్నది. అదేరీతిగా మీలో ఉన్నటువంటి మంచిచెడ్డలే ఇతరులలో ప్రతిబింబిస్తాయి.

అద్దమునకు వెనుక రసాయనము పూయకపోతే దాని అవతలున్న వస్తువులు కనిపిస్తాయి గాని, అందులో మీ ప్రతిబింబము మీకు కనిపించదు. హృదయం ఒక అద్దమువంటిది. దానికి ప్రేమ అనే రసాయనమును పూసినప్పుడే అందులో మిమ్మల్ని మీరు చూసుకోవచ్చు. ఆ ప్రేమయే దైవత్వం. దీనిని వేదాంతము "రసోవై సః" అన్నది. పానకమును, పంచదారను వేరు చేయటానికి వీలుకాదు కదా! పానకంలో పంచదార కలిసినట్లు, జగత్తంతా దైవత్వం నిండియుంది.

**"న శ్రేయో నియమం వినా"**

తమలపాకు, వక్క, సున్నములను తగు పరిమాణంలో కలిపినప్పుడే అది తాంబూలంగా మారుతుంది. అదేరీతిగా, కాల, కర్మ, కారణ, కర్తవ్యాలు కలిసివచ్చినప్పుడే మీ అభీష్టం నెరవేరుతుంది. తమలపాకు ఆకుపచ్చగా ఉంటుంది, సున్నము తెల్లగా ఉంటుంది. వక్క బ్రౌన్‌గా ఉంటుంది. ఈ మూడింటినీ కలిపి తాంబూలంగా సేవించిన్పుడు నాలుక ఎఱ్ఱగా మారుతుంది. సున్నము లేక రుచి ఉండదు. ఎఱుపురంగు రాదు. కాని, దానిని పరిమితంగా ఉపయోగించాలి; అధికంగా వేసుకుంటే నాలుక పొక్కిపోతుంది. కనుకనే "న శ్రేయో నియమం వినా" అన్నారు. మానవుడు ప్రతి విషయంలోనూ పరిమితిని పాటించాలి. దేహంయొక్క టెంపరేచర్ $98^0$ ఎఫ్ ఉంటే ఆరోగ్యంగా ఉన్నట్లు; $99^0$లకు పెరిగిందంటే జ్వరం ప్రారంభమైనట్లు. అదే రీతిగా, బ్లడ్‌ప్రెషర్‌కూడ ఒక పరిమితిలో ఉండాలి. 120/80 అనేది సహజమైన బ్లడ్‌ప్రెషర్. అది 150/90 కి పెరిగిందంటే, అదొక రోగంగా మారిపోతుంది. మీరు మాట్లాడే మాటలను, చేసే పనులనుకూడా ఒక పరిమితిలో పెట్టుకోవాలి. శక్తికి మించి పని చేయకూడదు. ఏ పని ఎప్పుడు ఎక్కడ ఏవిధంగా చేయాలి, అనే విచారణ చేయాలి. ప్రతి విషయంలోనూ 'డిసిప్లిన్' (క్రమశిక్షణ) ను పాటించాలి. పరిమితి లేకుండా, క్రమ శిక్షణ లేకుండా ప్రవర్తిస్తే అనేక పొరపాట్లు జరిగే అవకాశం ఉంది.

### ఏ వ్రతమునైనా చిత్తశుద్ధితో ఆచరించాలి.

ఈశ్వరుడు పార్వతికి వరలక్ష్మీ వ్రత ప్రాశస్త్యమును వివరించి "పార్వతీ! నీవు స్త్రీ జాతిచే దీనిని ఆచరింపచేసి, వారి కష్టనష్టములనురూపుమాపి, శాంతి సౌఖ్యాలను అందించు" అన్నాడు. ఈ వ్రతమును చేసుకోవటం చాలా సులభమే. అయితే ఈనాడు మీకు స్థానబలము, దైవబలము తోడుకావటం చాలా అదృష్టం. ఏ వ్రతమునైనా పవిత్రభావంతో, ఏకాగ్రతతో, చిత్తశుద్ధితో ఆచరించాలి. అప్పుడే మీకు ఎంతటి ఫలితమైనా లభిస్తుంది. భగవదనుగ్రహం చేత మీరు చేయలేని పని ఈ జగత్తులో లేదు; ఎంతటి ఘనకార్యమునైనా మీరు సాధించవచ్చును. సావిత్రి మరణించిన పతినే బ్రతికించుకోగల్గినప్పుడు ఇంక ఈ లోకసంబంధమైన విషయాలు ఎంతమాత్రము! భూమిని ఆకాశంగా మార్చవచ్చు, ఆకాశాన్ని భూమిగా మార్చవచ్చు. అయితే పవిత్రమైన హృదయంతో ప్రార్థించాలి. వారు ఇలాంటివారు, వీరు అలాంటివారు అంటూ ఊరివారి సుద్దులు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తే మీరు తలచిన కార్యములు ఎలా సిద్ధిస్తాయి? లోక సంబంధమైన సుద్దులు వదలిపెట్టి, లోకేశుణ్ణి ఆశ్రయించినప్పుడే మీయొక్క సర్వకార్యములూ సిద్ధిస్తాయి.

### ధనమూలం కాదు, ధర్మమూలం

ప్రేమస్వరూపులారా! 'భగవంతుడు మీ హృదయవాసి' అనే నమ్మకాన్ని పెంచుకోండి. ప్రతి దేహమునూ ఒక దేవాలయంగా భావించి, గౌరవించండి. ప్రతి ఒక్కరిలోనూ దేవుడున్నాడని విశ్వసించండి. అప్పుడు ప్రపంచంలో కలహములు, కల్లోలములకు అవకాశమే ఉండదు. ఈనాడు నేను వేరు, నీవు వేరు అనే భేదభావములు, స్వార్థప్రయోజనములు అధికం కావటంచేత కలహములు, కల్లోలములు అధికమైపోతున్నాయి. మానవుడు నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక విలువలను పెంచుకున్నప్పుడే ఈ కలహములు, కల్లోలములు సమసిపోతాయి. నేను అప్పుడప్పుడు చెపుతుంటాను. Money comes and goes, but morality comes and grows అని. ధనము వస్తుంది, పోతుంది. కాని నీతినియమాలు వస్తే పోవు, పైగా అభివృద్ధి చెందుతాయికూడ. అయితే ధనం కావలసిందే. ధనం లేకపోతే ఈ జగత్తులో జీవించుటకు వీలుకాదు. కాని, ధనమే సర్వస్వమని భావించరాదు. మన ప్రాచీనులు "ధర్మమూలం మిదం జగత్" అని భావించారు. కాని, ఈ కలియుగంలో ప్రజలు "ధనమూల మిదం జగత్"

sri sathyasai vachanamrutam

అంటున్నారు. ధనం వచ్చింది వచ్చినట్లుగానే పోతుంది. మనకు ఆనందం, సౌఖ్యము, సౌభాగ్యము ధర్మమునుండియే లభిస్తాయిగాని, ధనమునుండి కాదు.

## ద్రౌపది మాంగల్యరక్షణకు కృష్ణుని మాస్టర్ ప్లాన్ !

పాండవులు ధర్మమూర్తులు, మహాభక్తులు కనుకనే, మహాభారతయుద్ధంలో వారు విజయాన్ని సాధించగల్గారు. వారి ధర్మపత్ని అయిన ద్రౌపది మహాపతివ్రత.

పతుల పలుమాటలకు ఎదురు చెప్పంగబోదు
వారి సేవలు చేయగా తీరదనదు
తనకున్నదానిచే తృప్తి గనుచునుండు
ద్రౌపదికి సాటి ఏ పతివ్రతయు లేదు.

అయితే, ఐదుమంది భర్తలు కల్గిన స్త్రీ పతివ్రత ఎలా అవుతుందని చాలామందికి సందేహం కలుగుతుంది. ఆ ఐదుమందీ పంచభూతములకు, పంచప్రాణములకు ప్రతీకలనే సత్యాన్ని గుర్తిస్తే ఇలాంటి సందేహానికి అవకాశం ఉండదు. యుద్ధ సమయంలో ప్రతిరోజూ పాండవులదే పైచేయిగా ఉండటంతో దుర్యోధన, దుశ్శాసనాదులు కౌరవ సైన్యాధిపతిగా ఉన్న భీష్మునివద్దకు వెళ్ళి "తాతా! నీవిలా నీరసంగా ఉంటే లాభం లేదు. నీ శక్తి సామర్థ్యాలేమైనాయి? నీవు విజృంభిస్తే పాండవులు నీ ధాటికి నిలువగలరా?" అని రెచ్చగొట్టారు. తక్షణమే భీష్ముడు "దుర్యోధనా! రేపు సూర్యాస్తమయంలోపల పాండవులను సంహరిస్తాను" అని శపథం చేశాడు. ఈ సంగతి తెలిసి ద్రౌపది కృష్ణుని పాదాలపై పడి, తన మాంగల్యాన్ని కాపాడవలసిందిగా ప్రార్థించింది. కృష్ణుడు సమయానికి తగినట్లు 'మాస్టర్ ప్లాన్' వేస్తాడు. ఆ రోజు రాత్రి అందరూ నిద్రించిన తరువాత ఆమెను వెంటపెట్టుకొని భీష్ముని గుడారానికి బయలుదేరాడు. భీష్ముడు తొందరపాటుతో పాండవులను సంహరిస్తానని శపథం చేశాడేగాని, తరువాత తీవ్ర పశ్చాత్తాపానికి గురి అయ్యాడు. "కౌరవుల కూడు తినటంచేత నాకిలాంటి పాడుబుద్ధి కల్గింది" అని బాధపడ్డాడు.

ద్రౌపది కృష్ణుని వెంట నడుస్తున్నది. ఆమె వేసుకున్న చెప్పులు 'కిర్‌కిర్' మని శబ్దం చేస్తున్నాయి. కృష్ణుడు ఆమెను చెప్పులు వదలమన్నాడు. వాటిని తన అంగవస్త్రంలో చుట్టుకొని చంకలో పెట్టుకున్నాడు. ఆనాడు విద్యుద్దీపాలు లేవు. రాత్రిపూట గుడారాల్లో చిన్న చిన్న దీపాలు

srisathyasaivachanamrutam

వెలిగించుకునేవారు. అందరూ నిద్రించారు కాని, భీష్మునికి మాత్రం నిద్ర రావటం లేదు. ధర్మమూర్తులైన పాండవులను సంహరిస్తానని ప్రతిజ్ఞచేసినందుకు విచారిస్తూ, తన గుడారంలో అటూ, ఇటూ పచార్లు చేస్తున్నాడు. కృష్ణుడు ద్వారం వద్ద నిలబడి "ద్రౌపదీ! తక్షణమే వెళ్ళి భీష్ముని పాదాలపై పడు" అన్నాడు. ద్రౌపది పరుగెత్తిపోయి భీష్ముని పాదాలపై పడింది. ఆమె చేతికి వేసుకున్న గాజులు శబ్దం చేశాయి. ఆ శబ్దం విని భీష్ముడు తన అలవాటు ప్రకారం "దీర్ఘసుమంగళీ భవ" అని దీవించాడు. ఆనందంతో లేచిన ద్రౌపదిని చూసి భీష్ముడు ఆశ్చర్య చకితుడయ్యాడు. ఇంతలో కృష్ణుడు చిరునవ్వులు చిందిస్తూ లోపలకి వచ్చాడు. భీష్ముడు "కృష్ణా! ఇది నీవు చేసిన పనియే నన్నమాట. నీ లీలలు చిత్రాతిచిత్రములు" అని కొనియాడాడు.

చిత్రంబులు త్రైలోక్య ప
విత్రంబులు భవలతా లవిత్రంబులు స
న్మిత్రంబులు మునిజన వన
చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్!

## స్త్రీలను గౌరవించాలి

వివాహమైన స్త్రీకి 'గృహలక్ష్మి', 'ఇల్లాలు', 'ధర్మపత్ని', 'అర్ధాంగి' మున్నగు గొప్ప బిరుదులు ఇవ్వబడినాయి. ఇలాంటి గొప్ప బిరుదులు కలిగిన స్త్రీలను ఈనాడు పురుషులు చులకన భావంతో చూస్తున్నారు. ఇది చాలా పొరపాటు. స్త్రీలను గౌరవించినప్పుడే పురుషులకు కూడా గౌరవం పెరుగుతుంది. స్త్రీల హృదయాన్ని నొప్పించకూడదు; వారికి కన్నీరు తెప్పించకూడదు. స్త్రీలు కన్నీరు కార్చితే కుటుంబం అనేక కష్టాలకు గురి అవుతుంది. కాలిలో విరిగిన ముల్లును బయటికి తీయవచ్చు గాని, హృదయానికి గ్రుచ్చుకున్న కఠినమైన మాటలను వెలికితీయటానికి వీలుకాదు. కనుక, కఠినమైన మాటలతో స్త్రీల హృదయాలను బాధపెట్టకూడదు. "ఈమె నా భార్య కదా, ఈమెను ఇష్టమొచ్చినట్లు తిట్టే అధికారం నాకుంది" అనుకోకూడదు. భార్య ఏమైనా తప్పు చేస్తే సరిదిద్దవచ్చును. అంతేగాని ఆమెను ఇష్టమొచ్చినట్లు తిట్టటానికి భర్తకు అధికారం లేదు. అయితే మగవారందరూ ఆవిధంగా ఉండరు కాని, కొంతమంది ఉంటారు. మగవారికి కొంచెం కోపం ఎక్కువ. ఆ కోపాన్ని హద్దులో పెట్టుకోవాలి. అది వారికే మంచిది.

srisathyasaivachanamrutam

## కోపం పతన హేతువు : జరాసంధుని వృత్తాంతం

మానవునికి ఒక్కతూరి కోపం వచ్చిందంటే, మూడు నెలల ఆహారం భుజించటంవల్ల వచ్చిన శక్తి ఒక్కసారిగా భస్మమైపోతుంది. కోపంవల్ల దేహంలోని రక్తం ఉడికిపోతుంది. అది చల్లారటానికి మూడు నెలలు పడుతుంది. చీటికిమాటికి కోపం వస్తే జీవితమే నాశనమౌతుంది.

జరాసంధుని వృత్తాంతం దీనికి చక్కని నిదర్శనం. కృష్ణుడు పలు పర్యాయములు జరాసంధునిపైకి యుద్ధానికి వెళ్లాడు. జరాసంధుడు ఉగ్రుడై యుద్ధభూమికి వచ్చేటప్పటికి కృష్ణుడు పారిపోయేవాడు. "స్వామీ! మీరు జరాసంధునికి భయపడి పారిపోతున్నారేమిటి?" అని ప్రశ్నించగా కృష్ణుడు చక్కని సమాధానం చెప్పాడు. "జరాసంధుణ్ణి సంహరించటం నాకు చేతగాక కాదు. కాని వానితో యుద్ధం చేయటం నాకిష్టం లేదు. అందుచేత యుద్ధం చేయకుండా వానిని చంపుతున్నాను" అన్నాడు. "స్వామీ! యుద్ధం చేయకుండా మీరు వానిని ఎలా చంపగలరు?" అని అడుగగా కృష్ణుడు "జరాసంధుడు మహాబలవంతుడు. వానిని సంహరించాలంటే మొట్టమొదట వానిని బలహీనుణ్ణి గావించాలి. అందునిమిత్తం వానికి తరచుగా కోపం తెప్పించాలి. కనుకనే నేను అనేక పర్యాయములు వానిపైకి యుద్ధానికి వెళ్ళినట్లుగా నటించి, వానికి కోపం తెప్పించి, వెంటనే పారిపోయి వస్తున్నాను. ఈవిధంగా పారిపోయిరావటం నాకేమీ అవమానం కాదు. నాకది గౌరవమే. ఎందుకంటే ఆయుధాలను ఉపయోగించకుండా శత్రువుని బలహీనుణ్ణి గావిస్తున్నాను" అన్నాడు. కృష్ణుడు యుద్ధానికి వెళ్ళిన ప్రతి పర్యాయమూ జరాసంధునిలో కోపం అధికమౌతూ వచ్చింది. తత్ఫలితంగా అతని దేహము క్రమక్రమేణ బలహీనమైపోయింది. భగవంతుడు ఏ ప్లాను వేసినా, ఏ పనిచేసినా అది ఇతరుల మంచికోసమే! కాని, కొందరి దృష్టికి అదిచెడ్డగా కనిపించవచ్చు. అది వారి దృష్టిదోషమేగాని, భగవంతుని చర్యలో ఎలాంటి దోషమూ ఉండదు.

## వరలక్ష్మీవ్రత విశిష్టత

వరలక్ష్మీ వ్రతము నాచరించినప్పుడు స్త్రీలు "దీర్ఘసుమంగళీ భవ, పుత్రపౌత్రాభివృద్ధిరస్తు, ఆయురారోగ్యఐశ్వర్యాభివృద్ధిరస్తు" అని దీవెనలు పొందుతున్నారు. ఈ వ్రతము ఇటువైపు ఏడు తరములను, అటువైపు ఏడుతరములను మొత్తం పధ్నాలుగు తరములవారిని రక్షిస్తుంది. కనుకనే ఈశ్వరుడు పార్వతికి ఈ వ్రతమాహాత్యమును తెలియచేసి, స్త్రీలచేత ఈవ్రతమును

srisathyasaivachanamrutam

ఆచరింపచేసి వారికి సుభిక్షమును, సౌభాగ్యమును ప్రసాదించవలసిందని కోరాడు. ఈ వరలక్ష్మీ నోమును నోచిన తరువాత సావిత్రి, అనసూయ, సుమతి సుఖసంతోషాలను పొందారు. దోషాలను పరిహారం చేసి, పవిత్రతను అభివృద్ధి గావించి, దివ్యత్వాన్ని అందిస్తుంది వరలక్ష్మి. వరలక్ష్మిని భారతీయులు 'లోకమాత' అని పిలుస్తున్నారు. మన భారతదేశంలో 'మాత' అనే పదమునకు ఎంతో గొప్ప విలువ ఉన్నది. ఎవరికైనా బాధ కలిగినప్పుడు 'అమ్మా' అని అంటారు గాని, "అయ్యా, అప్పా" అనరు. 'అమ్మ' అనే పదము ఎంతో విలువైనది, పవిత్రమైనది. పిల్లలకు మొట్టమొదట నోటికి వచ్చే పదము ఇదే. తల్లిప్రేమ వర్ణనాతీతమైనది. కనుకనే భారతీయ సంస్కృతి "మాత, పిత, గురువు, దైవము" అని తల్లికి ప్రథమస్థానం అందించింది. తల్లిని ప్రేమించాలి, ఆమె ఆజ్ఞను శిరసావహించాలి. తల్లిని సంతృప్తిపరచకపోతే లోకం మిమ్మల్ని ఛీకొడుతుంది. తల్లిని సంతృప్తిపరచితే లోకాన్నంతటినీ సంతృప్తిపరచినట్లే!

### స్త్రీలు లక్ష్మీస్వరూపులు

ప్రేమస్వరూపులారా! పవిత్రమైన వరలక్ష్మీ వ్రత మాహాత్మ్యమును గురించి ఎంతైనా చెప్పవచ్చును. ఆడవారు లోకమాతయైన వరలక్ష్మిని పూజించి, ఆశ్రయించి , ఆనందించి, ఆ ఆనందాన్ని పదిమందికి పంచాలి. వారికి తగిన ఉత్సాహ ప్రోత్సాహములను మగవారు అందించాలి. ఖర్చు ఎక్కువవుతుందని అడ్డు చెప్పకూడదు. భార్య వ్రతంచేయటం భర్తయొక్క ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధికే కదా! కాబట్టి, భార్య చేసే పూజకు భర్త ఏమాత్రమూ అడ్డు తగలకూడదు. ఒకవేళ తనకేమైనా ఇబ్బందిగా ఉంటే మంచి మాటలతో నచ్చచెప్పవచ్చును. అంతేగాని 'నేను మగవాడిని కదా' అని తన ఇష్ట ప్రకారం ప్రవర్తించకూడదు. నిజం చెప్పాలంటే మగవారికంటే ఆడవారికే శక్తి అధికంగా ఉంటుంది. ఆడవారు పతికోసం ప్రాణాలను సహితం త్యాగం చేస్తారు. మరణించిన సతిని బ్రతికించుకున్న పతి ఎవరైనా ఉన్నారా? గౌరవం, మర్యాద, త్యాగం, సంతృప్తి, సౌశీల్యంవంటి సద్గుణాలు స్త్రీలలోనే ఉన్నాయి. పురుషులలో మాత్రం క్రోధం, మొండితనం, హఠమువంటి దుర్గుణాలు అధికంగా ఉంటాయి. కనుకనే, పురుషులకంటే స్త్రీలకే అధిక గౌరవం ఇవ్వబడుతోంది. లగ్న పత్రికలపై కూడా 'శ్రీమతి & శ్రీ' అని ముందు స్త్రీ పేరు, తరువాతనే పురుషుని పేరు వ్రాస్తారు. రాధాకృష్ణులు, లక్ష్మీనారాయణులు, పార్వతీ పరమేశ్వరులు అనే పేర్లలోకూడా స్త్రీ పేరే ముందున్నది. స్త్రీలు లక్ష్మీస్వరూపులు. వారిని

srisathyasaivachanamrutam

గౌరవించినప్పుడే లోకం సుక్షేమంగా, సుభిక్షంగా ఉంటుంది. గుణవంతులైన స్త్రీలు ఉండటంచేత భారతదేశమునకు మాత్రం ఎట్టి ప్రమాదమూ సంభవించలేదు. భారతదేశమునకు పవిత్రత స్త్రీలవల్ల ఏర్పడినదే. కనుక, స్త్రీలను గౌరవించి , వారిని ఆనందపరచాలి. అప్పుడే దేశం నిత్య కళ్యాణం, పచ్చతోరణంగా వర్ధిల్లుతుంది.

**(11.8.2000 సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్య సందేశము)**

sri sathyasai vachanamrutam